# ధైర్యే...సాహసే..

మంత్రవాది మహేశ్వర్




చలపతి పాపం బి. యస్సీ పాసయ్యాడు. ఆ విషయం తెలియగానే వాళ్లమ్మ ముఖం చాటంత అయిందిగానీ, వాళ్ల నాన్న ముఖం జల్లెడంత కూడా కాలేదు సరికదా చింతపిక్కలా నల్లగా తయారైంది. తన వంశోద్ధారకుడికి ఎక్కడైనా ఉద్యోగం వుంటే చూడమని బజారులో కనబడి మినిమమ్ పదిపళ్ళైనా బయటపెట్టి నవ్వేవాళ్లందరికీ చెప్పాడు. పదహారువళ్ళు కనిపించేట్టు నవ్వి ''అలాగే'' అన్నారుగానీ నవమాసాలూ దాటినా ఎవ్వరూ ఏ యిన్‌ఫర్మేషనూ చలపతి తండ్రిగారి చెవిలో పడేయలేదు.

సినిమా పత్రికలు అక్షరం మిగలకుండా చదవడం, వాటిలోని తారల అర్ధనగ్న దృశ్యాలను చూసి ఏవేవో ఊహించేయడం, సాయంకాలాలు ట్రిమ్‌గా తయారై పిల్ల–గాలికి తిరగడం చలపతి ప్రస్తుత కార్యక్రమ వివరాలు.

స్టవ్‌మీద బాణట్లో ఏదో 'సుయ్'మంది... ప్రక్కింటావిడ పరిగెత్తుకొచ్చింది. అమ్మ ఏదో టిఫిన్ చేస్తున్నట్లుంది ... అవును ప్రొద్దున్న జంతికలు చేస్తానన్న విషయం గుర్తొచ్చింది చలపతికి... ఎంతో సంతోషం. మనసు గాలిలో సర్కస్‌ఫీట్లు చేస్తోంది. కారణం ఆ ప్రక్కింట్లో అందమైన అమ్మాయి వుంది ... ఆ అమ్మాయి సరోజ. సరోజ నవ్వితే చలపతికి ఎంతో భయం, టూత్‌పేస్ట్ కంపెనీవాళ్ళు ఎత్తుకుపోతారేమోనని. తరచు వచ్చేది వాళ్ల అమ్మే. సరోజ రావటం చాలా తక్కువే. సరోజ మొన్నీమధ్యనే బి. ఎ. మొదటి సంవత్సరంలో చేరింది. పుస్తకం పట్టుకుని గుమ్మందగ్గరికి వచ్చినప్పుడల్లా గుడ్లప్పగించి మరీ చూస్తాడు చలపతి. కనీసం 'గుండీలు తీసిన మొనగాడు' అనిపించుకోవాలని కాబోలు చొక్కాకుండే గుండీల్లో పైవి రెండూ విప్పి వుంచుతాడు.

చలపతి వాళ్లమ్మ కామాక్షి తన గురించే పొగుడుతూ చెబుతోంది ఆవిడతో ... అది వినబడకుండా చేయాలని డొక్కు రేడియో చేసే ప్రయత్నాలను అణిచేయాలని కట్టేశాడు.

''ఏమండీ ఈ సంగతి విన్నారు, మొన్న గోపీనాధన్ ఆయన భార్యా సినిమా చూస్తుంటే భయపెట్టి, ఆవిడ గాజులు, గొలుసు లాక్కుని పోయారట నలుగురు దొంగ వెధవలు.''

''గోపీనాదన్ కాదండి రాఘవయ్యగారూ వాళ్ళని విన్నాను ఆవిడే చెప్పింది ఆయన వాచీ లాక్కున్నారట నిన్న.''

''అయితే మొన్న, నిన్నకూడా జరిగిందన్న మాట... చూశారా.'' ముక్కు మీద వేలు వేసుకుంది.

''అందుకేనండి అమ్మాయి టైపు ఆరు గంటల్నుంచుంటే టైమ్ మార్పించేశాను.'' సరోజ వాళ్ళమ్మ.

లోపల్నుంచీ యిదంతా వింటున్న చలపతి వంటగదివైపు నడిచాడు. ''భయపడకూడదండి. ఎదురుతిరిగి రోగం కుదర్చాలిగానీ బెదిరిపోతే లోకువైపోతాం...'' హీరోలా అంటూ.

సరోజ లేడిపిల్లలా పరిగెత్తుకుంటూ వచ్చింది ''నువ్వైతే మొగాడివి... అమ్మాయి వయసులోవున్న పిల్ల'' అంటూండగా—

సరోజ అదోలా చూసింది చలపతివైపు.

చేతిలోని సినిమా పత్రికపైనున్న హీరోని సరోజకేసి చూపించాడు సింబాలిక్‌గా.

''తన్ని లాక్కునే దొంగ వెధవలకి ఆడా–మగా తేడా ఏముంటుందమ్మా'' సరోజ.

''అది కాదు కోడలా... ఆడవాళ్ళకైతే చేతికి గాజులు, మెడలో గొలుసు కళ్ళకు తక్కువ కనబడతాయి'' కామాక్షమ్మ అందుకుంది.

చలపతికి వాళ్ళమ్మన్నదాంట్లో 'కోడలా' అన్నదే నచ్చింది.


''లాక్కోవాలంటే మగవాళ్ళ వాచీ లాక్కోలేరా... రాఘవయ్యగారి పనేమైంది'' సరోజ.


''అది మనుషుల్నిబట్టి వుంటుంది. మనలో ధైర్యం వుంటే ఎవ్వరూ ఏమీ చేయలేరు'' హీరోలా చలపతి.

''అవి సినిమాల్లో అనుకోవడానికే పనికొస్తాయి.''

''ఆడవాళ్ళకు అంతకంటే ఏం తెలియదు'' తన మాటే పైనున్నందుకు చలపతి సంబరపడిపోయాడు.

చలపతి వాళ్ళుండేది విశ్వాస్‌నగర్‌లో. బస్సుదిగి పావుగంట నడవాలి. కొంతవరకూ కాలనీల్లోంచే నడిచినా తరువాతే ఏంజరిగినా. అంతా నిశబ్దంగా వుంటుంది. చలపతి స్టంటు సినిమాలు ఎక్కువ




చూస్తాడు కనుక యిటువంటివి లెక్కపెట్టడు. నిజం చెప్పాలంటే ఇటువంటివి వినడమే గానీ జరిగెరగడు.

వరుసగా రెండురోజుల నుంచి ఏదో చిన్నా చితకా దొంగతనం జరుగుతునే వుంది. ఆ తరువాత రెండు రోజులేవీ లేదు. కానీ చలపతికి 'జరిగితే' అన్న అనుమానం బయలుదేరింది. దాంతో మాస్టర్ ప్లానేశాడు చేతి గడియారాన్ని చూసుకుని.

— ఆ రోజు తన అభిమాన నటుడి స్టంట్ సినిమా చూశాడు. మహాబోరుగా వుంది సినిమా. అయినా స్టంట్స్ బావున్నాయనుకున్నాడు. ఫ్రెండ్స్ తలొక మూలకి వెళ్ళిపోయారు. యిక మిగిలింది తనొక్కడే. బస్సు దిగి నడుస్తున్నాడు.

తరచుగా పగటి పూట వెలిగే లైటు పొరపాటున కాబోలు రాత్రి వెలుగుతోంది. అంతవరకూ బానేవుంది... కానీ అక్కడ స్తంభం ప్రక్కన నల్లచొక్కావాడు వెర్రిగా నవ్వాడు. వాడు నవ్వాడు కదాన్నట్లు నవ్వుతున్నాడు నీలం చొక్కావాడు. ... షోలే సినిమాలో గబ్బర్ సింగ్ గుర్తొచ్చాడు.

చలపతి అక్కడి దాకా వచ్చేసరికి హిందీలో కాదు హైదరాబాదు భాషలో ఏవో డైలాగ్స్ కొట్టడం మొదలెట్టారు.

'గొంతు' మినపరొట్టెంత లావుగా వుంది.

'అరేయ్ యిదరావ్' నీలం చొక్కా.

వెనక్కి చూసిన చలపతి భయపడ్డాడు. కానీ అభిమాన నటుడ్ని గుర్తుకుతెచ్చుకున్నాడు... ఒంట్లోకి ఆంజనేయ స్వామి ప్రవేశించేశారు. దండకం చదువుకోకపోయినా. అదీ కాకుండా తను ముందు యిలా జరుగుతుందని వూహించి వేసిన ప్లాను తలుచుకుని 'వెర్రివెధవలు' అనుకుంటూ ముందుకు నడిచాడు.

ఆగక తప్పింది కాదు.

నల్లచొక్కా అడ్డమొచ్చింది...

నీలం చొక్కా చేయి చలపతి చంపతో

# ధైర్యే ... సాహసే !

డ్యూయెట్టు పాడింది. అయినా దడవలేదు. వాడు కొట్టిన దెబ్బకు దవడలో వైబ్రేషన్స్ మొదలయ్యాయి. కాలేజీ రోజుల్లో 'ఫిజిక్స్' చూడకపోయినా గుర్తొచ్చాయి.

''వాచ్ నికాల్‌కే దేవ్‌ర్'' ఒకడు.

''తూదేనేకా క్యారే, మైహీఁ లేవుంగా'' అంటూ చేతిని లాక్కుని 'షాక్' తిన్నట్టు అయ్యాడు.

చలపతికి నవ్వొచ్చింది. కానీ నవ్వలేదు నీలంచొక్కా కళ్ళు ఎర్రగా మారినందుకు.

వాచీ చైనొకటే పెట్టుకున్నాడు.

ఎదురుతిరిగితే వీపు విమానం మోత మోగించి 'దీపావళి' గుర్తుకు తేగలరు.

చాచి లెంప పగులకొట్టాడు నల్లచొక్కా వాడు.

'హమ్‌కో పాగల్ బనాతారే' నీలంచొక్కాలో పౌరుషం చలపతి చేయిని మెలికలు తిప్పుతోంది.

చలపతి ధైర్యం పారిపోయింది.

కళ్ళలోంచి నీరు కారేసుకొచ్చింది.

ఆ వీధిగుండా ఎవరైనావస్తే బావుండు ననుకున్నాడు. కానీ ఎవ్వరూ రావటంలేదు.

''షర్టు టెరీకాట్‌కా దిక్‌రా నికాల్'' నీలంచొక్కా ఆర్డరు జారీచేసింది.

* * *

అంతే చొక్కా లేదు.

మరో క్షణానికి మరో ఆర్డరు

* * *

డబుల్ నిటెడ్ పాంటు—పాంటులో దాచిన సీకో వాచీ.

ఆ రెండూ వాళ్ళు మడత పెట్టుకుంటున్నారు.

డ్రాయర్, బనీనుతో నిలబడి వెళ్ళిపోతున్న ఆ యిద్దరికేసి చూస్తుండిపోయాడు.

ఆ ఇద్దరి నవ్వు తనని వెక్కిరిస్తున్నాయి.

సరోజ ముందు కొట్టిన హీరో పోజులేవి యిప్పుడు.

'చేసేదేముంది... తొందరగా యిక్కడ్నుంచి యిల్లు చేరుకోవాలి' త్వరత్వరగా నడిచాడు. ఎలక్ట్రిసిటీ బోర్డువారి ధర్మమా అంటూ అక్కడ స్ట్రీట్ లైట్సేమీ వెలగటంలేదు...

అరె... సరోజ వాళ్ళింట్లో లైట్లింకా వెలుగుతున్నాయి. కొంపదీసి చూడరుకదా — అనుకుంటూ కంగారుగా నడిచాడు.

రేడియోలో జనరంజని యింకా పూర్తికాలేదు. 'భలే భలే మగాడివోయ్' పాట జోరుగా వినిపిస్తోంది. అంతవరకూ లోపలెక్కడో వున్న సరోజ అప్పుడే కిటికీదగ్గరకొచ్చి వెన్నెట్లో ప్రక్కింటిగేటు తెరుస్తున్న చలపతిని చూసి గుర్తుపట్టిందో లేదో తెలియదుగానీ కెవ్వుమని కేకవేసింది. □

## మంకెన పూలు

నేలచూపులు చూసే
మంకెన పూలే
ఈ వ్యవస్థలో
బాధపడే నేత్రాలు —
శిరసెత్తితే
కనిపిస్తుంది
ఎర్రబడిన ఆకాశం
ఉదయ కిరణాలతో
ఉద్యమిస్తే
వినిపిస్తుంది నవగీతం
పల్లవించే చరణాలతో !!!

— రామసూరి